సాక్షి సిద్దిపేట

సోమవారం ı 6 ı నవంబర్ ı 2023



నువ్వా.. నేనా

సెంటిమెంట్ ఇలాఖా అయిన గజ్వేల్ నియోజకవర్గంలో వివిధ పార్టీల ప్రచారం ఊపందుకుంది. వివరాలు 10లో ▸



మాయమాటలు నమ్మి..

బీజేపీ, కాంగ్రెస్ మాయమాటలు నమ్మి గోస పడొద్దని ఎమ్మెల్సీ యాదవరెడ్డి అన్నారు.

వివరాలు10లో ▸

ఎన్నికల వేళ ప్రజావాణి రద్దు

సిద్దిపేటరూరల్: ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఎన్నికల లెక్కింపు ముగిసేంతవరకు రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజావాణి రద్దు అయిన సందర్భంగా ప్రజలు ఈ విషయాన్ని గమనించి కలెక్టరేట్‌కు ఎవరూ రావద్దని కలెక్టర్ సూచించారు.

న్యూస్‌రీల్

పథకాలపై శ్వేత పత్రం విడుదల చేయాలి

కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణ



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణ

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని సిద్దిపేట కాంగ్రెస్ అభ్యర్థి హరికృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక తాడూరి గార్డెన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత బంధు, రైతు రుణమాఫీ విషయంలో ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం ప్రభుత్వం చేసిన భూసేకరణ ప్రక్రియ లోపభూయిష్టంగా ఉందని ఆరోపించారు. ప్రభుత్వ వైద్యం సరిగ్గా అందడం లేదని, పాఠశాలల్లో వసతులు లేవని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ పెద్దలు నమ్మకంతో తనకు టికెట్ కేటాయించారని, అంతే నమ్మకంతో అందరితో కలిసి పార్టీ విజయానికి కృషిచేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, మహేందర్, చంద్రం, యాదగిరి, నాగరాజు, సతీశ్, కలీమ్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు లక్ష్మీ, పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు పాల్గొన్నారు.

కన్నీళ్లను రచనలుగా మలిచిన కవి దాశరథి

బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం



దాశరథి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కవులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రజల కన్నీళ్లను రచనలుగా మలిచి నిజాం నిరంకుశత్వంపై పోరాటం చేసిన కవి దాశరథి అని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం అన్నారు. దాశరథి వర్ధంతి సందర్భంగా కవులు కోణం పరశురాములు, బస్వరాజ్ కుమార్‌తో కలిసి ఆదివారం సిద్దిపేటలో దాశరథి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజేశం మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలిచి, ప్రజా చైతన్యం కోసం పాటుపడిన దాశరథి బాటలో కవులందరూ నడవాలని సూచించారు. అగ్నిధార, రుద్రవీణ, తిమిరంతో సమరం, గాలిబ్ గీతాలు, సినిమా పాటలు సైతం రాసి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. దాశరథిని జైలులో బంధించినా బొగ్గుతో గోడలపై పద్యాలు రాసి, ఉద్యమస్ఫూర్తిని చాటాడన్నారు. కేంద్ర సాహిత్య పురస్కారం అందుకుని ఆంధ్రప్రదేశ్ ఆస్థాన కవిగా పనిచేశారన్నారు.

రైతులను ఆదుకునేది కాంగ్రెస్సే

పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న పొన్నం ప్రభాకర్

కోహెడరూరల్(హుస్నాబాద్): రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణ మాఫీ ఏకకాలంలో చేస్తామని కాంగ్రెస్ పార్టీ హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మండలంలోని రాంచంద్రాపూర్, వింజంపల్లి, వరుకోలు, గొట్లమిట్ట, నారాయణపూర్ గ్రామాలలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్‌కు చెందిన నాయకులకు ఆయన కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బస్వరాజ్ శంకర్, మండల అధ్యక్షుడు ధర్మయ్య, నాయకులు పాల్గొన్నారు.



ఆలయ రాజగోపురం ఎదుట భక్తుల సందడి



కొమురవెల్లి మల్లన్న దీవించు


కొమురవెల్లి మల్లికార్జున ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మల్లన్న మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణతో ఆలయ పరిసరాలు పులకరించాయి. సుమారు 13 వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు. - కొమురవెల్లి (సిద్దిపేట)



వర్గల్ మండలం శాకారం వద్ద లైట్లు వేసుకుని వెళ్తున్న వాహనం

కమ్మేసిన పొగమంచు

జిల్లా అంతటా పొగమంచు కమ్మేసింది. ఆదివారం ఉదయం 9 గంటలైనా మంచు వీడలేదు. భానుడు సైతం చంద్రుడిలా తలపించాడు. దట్టంగా పొగమంచు కప్పేయడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనబడక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దారి కన్పించకపోవడంతో లైట్లు వేసుకుని వెళ్లారు. - వర్గల్(గజ్వేల్)/దుబ్బాక



భానుడు సైతం చంద్రుడిలా..!

సిద్దిపేట.. హ్యాట్రిక్ కోట



గురవారెడ్డి



రాజేశ్వర్‌రావు



వీబీ రాజు



మదన్ మోహన్



కేసీఆర్



హరీశ్‌రావు

మామ, అల్లుళ్ల డబుల్ ధమాకా

- విలక్షణ తీర్పునకు వేదిక
- సీఎం కేసీఆర్ రాజకీయ గడ్డ
- 50 ఏళ్లలో ముగ్గురే ముగ్గురు
- తొలి, మలి దశ ఉద్యమం ఇక్కడే
- నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం

తెలంగాణ తొలి, మలి ఉద్యమానికి ఊపిరి సిద్దిపేట. ఉద్యమాల పురిటి గడ్డగా, విలక్షణమైన తీర్పునకు వేదికగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. నాడు తెలంగాణ ప్రజాసమితితో తొలిదశ ఉద్యమానికి అనంతుల మదన్ మోహన్ నాయకత్వం వహించారు. నేడు మలిదశ ఉద్యమం ద్వారా స్వరాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాజకీయ ఓనమాలు నేర్పిన గడ్డ ఇది. మామ రాజకీయ వారసత్వాన్ని అందిపుచ్చుకుని హరీశ్‌రావు ప్రస్తుతం అదే పరంపర కొనసాగిస్తున్నారు.



నియోజకవర్గ మొత్తం ఓటర్లు:	2,28.523
పురుషులు:	1,12.934
మహిళలు:	1,15.520
ఇతరులు:	69
పోలింగ్ కేంద్రాలు:	273

నియోజకవర్గ పరిధిలో మండలాలు: సిద్దిపేట అర్బన్, రూరల్, నారాయణరావుపేట, చిన్నకోడూరు, నంగునూరు

సిద్దిపేటజోన్: సిద్దిపేట నియోజకవర్గం ఏర్పడి 71 ఏళ్లు అయినప్పటికీ ఐదు దశాబ్దాలుగా ముగ్గురిని మాత్రమే ప్రజలు ఆదరించి విలక్షణమైన తీర్పును ఇచ్చారు. వారిలో మదన్ మోహన్ హ్యాట్రిక్ సాధించగా, సీఎం కేసీఆర్, ఆయన మేనల్లుడు హరీశ్‌రావు మాత్రం డబుల్ హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు. సిద్దిపేటలో బీఆర్‌ఎస్ ఐదుసార్లు, కాంగ్రెస్ ఐదు సార్లు, టీడీపీ నాలుగు సార్లు, ఒక్కొక్కసారి పీడీఎఫ్, టీపీఎస్, స్వతంత్ర అభ్యర్థులను ఆదరించారు. ప్రస్తుతం ఏడోసారి విజయం కోసం హరీశ్‌రావు బరిలో ఉన్నారు.

ముగ్గురూ ముగ్గురే..

సిద్దిపేట నియోజకవర్గం 1952లో ఆవిర్భవించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు నియోజకవర్గంలో ఇరవై సార్లు ఎన్నికలు జరిగాయి. వాటిలో తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో ఐదుసార్లు ఉప ఎన్నికలు వచ్చాయి. 1952లో ఎడ్ల గురవారెడ్డి(పీడీఫ్), 1957లో రాజేశ్వర్‌రావు(కాంగ్రెస్), 1962లో సోమేశ్వర్‌రావు(స్వతంత్ర), 1967లో వీబీ రాజు(కాంగ్రెస్)ను నియోజకవర్గ ప్రజలు ఒక్కోసారి ఆదరించి గెలిపించారు. తర్వాత 1970లో పోటీ చేసిన మదన్ మోహన్‌ను నాలుగు సార్లు, తర్వాత పోటీ చేసిన కేసీఆర్, హరీశ్‌రావును ఆరు సార్లు వరుసగా గెలిపించారు. వారిలో మదన్ మోహన్ హ్యాట్రిక్, కేసీఆర్, హరీశ్‌రావు డబుల్ హ్యాట్రిక్ సొంతం చేసుకున్నారు.

ఉద్యమానికి వేదిక..

సిద్దిపేట తెలంగాణ తొలి, మలి ఉద్యమానికి వేదిక లాంటిది. 1969 తొలి విడత ఉద్యమ నేపథ్యంలో అప్పట్లో వీబీ రాజు ఎమ్మెల్యేగా రాజీనామా చేశారు. 1970లో జరిగిన తొలి ఉపఎన్నికల్లో తెలంగాణ ప్రజా సమితి(పీడీఎఫ్) నుంచి అనంతుల మదన్ మోహన్ పోటీచేసి విజయం సాధించారు. అక్కడి నుంచి మొదలైన మదన్ మోహన్ రాజకీయ ప్రస్థానం 1985 వరకు కొనసాగింది. కాంగ్రెస్‌లో టీపీఎస్ విలీనం కావడంతో పీవీ రాజేశ్వర్‌రావు, మర్రి చెన్నారెడ్డి, భవనం వెంకట్రాం, టి.అంజయ్య, కోట్ల విజయభాస్కర్ రెడ్డి ప్రభుత్వాల్లో మదన్ మోహన్ పలుశాఖల మంత్రిగా పనిచేశారు. 1985లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో మదన్ మోహన్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ప్రతిపక్ష నాయకుడుగా కొనసాగారు. అదే పంథాలో సీఎం కేసీఆర్ 2001లో మలి విడత తెలంగాణ ఉద్యమాన్ని చేపట్టి స్వరాష్ట్ర సాధన ద్వారా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. అంతకు ముందు కేసీఆర్ ఎన్టీఆర్, చంద్రబాబు ప్రభుత్వాల్లో మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా కొనసాగారు.

2001 నుంచి గులాబీ గుబాళింపు

ఒకప్పుడు కాంగ్రెస్, తర్వాత టీడీపీలకు కంచుకోటగా ఉన్న సిద్దిపేట నియోజకవర్గం నేడు గులాబీ పార్టీకి కంచుకోట అయ్యింది. తెలంగాణ మలి విడత ఉద్యమ నేపథ్యంలో కేసీఆర్ టీడీపీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్) పేరిట గులాబీ జెండా చేపట్టారు. నాటి నుంచి నేటి వరకు రెండు దశాబ్దాల కాలం పైగా సిద్దిపేట గులాబీ పార్టీకి అడ్డాగా మారింది.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

రాష్ట్రం అప్పుల కుప్ప

- కేసీఆర్ మరోసారి గెలిస్తే ప్రజలకు చిప్పే..
- రాష్ట్రాన్ని బతికించుకోవడానికే కాంగ్రెస్‌కు మద్దతు
- తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం

హుస్నాబాద్: రాష్ట్రంలో తొమ్మిదేళ్ల నిరంకుశపాలన, అవినీతితో సంపదను కొల్లగొట్టిన సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపిస్తే ప్రజలకు చిప్పేగతి అని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఆదివారం హుస్నాబాద్ పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో ప్రజల ఆకాంక్ష నెరవేరలేదన్నారు. ప్రాజెక్టుల పేరిట రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారన్నారు. రూ.లక్షల కోట్లు వెచ్చించి ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మించినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే మాదిరి ఒక ఎకరాకు నీరు అందించలేదన్నారు. కాళేశ్వరం ద్వారా సాగునీరు అందడం లేదని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారనే సాగు నీరు అందుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాంట్రాక్టర్ల జేబులో నింపుకోవడానికే తప్ప ఏలాంటి ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికే కాళేశ్వరం పంపులు మునిగిపోయాయని, ఎల్లంపల్లి వద్ద గండిపడిందని, మధ్యమానేర్ సొరంగాలు లీక్ అవుతున్నాయని దీంతో మనకు నీళ్లు ఏలా వస్తాయని ప్రశ్నించారు. దేశంలోనే అత్యంత సంపన్నుల జాబితాలో కేసీఆర్ చేరిపోయారన్నారు. ప్రాజెక్టుకు సంబంధించి లెక్కల ప్రకారం రూ.25వేల కోట్లు గల్లంతు అయ్యాయని నిపుణులు చెబుతున్నారని అన్నారు. కాళేశ్వరం కొట్టుకుపోయినట్టే కేసీఆర్ కొట్టుకుపోతాడని అన్నారు. ధరణి కేసీఆర్ కుటుంబానికి కుంకుమభరణిగా మారిందని, ప్రజల కుంకుమ భరణిగా మార్చాలన్నారు.

దుర్మార్గమైన పాలనకు చరమగీతం పాడాలి..

కేసీఆర్ దుర్మార్గపు పాలనకు చరమ గీతం పాడాలని ఉన్నత విద్యా మండలి మాజీ చైర్మన్ పాపిరెడ్డి అన్నారు. ప్రస్తుత ఎన్నికలు రాజకీయ పార్టీల మధ్య కాదని, కేసీఆర్ నియంతృత్వ పాలన, అవినీతి, అవసరం లేని ప్రభుత్వం, ప్రజాస్వామిక తెలంగాణ మధ్య జరుగుతున్నాయని తెలిపారు.

బీఆర్‌ఎస్ కండువాలు కప్పుకోలేదు..

విద్యావంతులు, ప్రజా సంఘాలు కలిసి సమావేశం ఏర్పాటు చేసుకుంటే, బీఆర్‌ఎస్ నాయకులు మేధావుల సంఘమని అనడం వారి అవివేకమని ఋణ విముక్తి కమిషన్ మాజీ సభ్యుడు కవ్వ లక్ష్మారెడ్డి అన్నారు. మేము ఏనాడూ బీఆర్‌ఎస్ కండువాలను కప్పుకోలేదని, ఏ ప్రజాప్రతినిధో రెకమెండేషన్ చేస్తే మాకు పదవులు రాలేదని, తెలంగాణ ఉద్యమంలో పని చేసిన గుర్తింపుగా పదవులు వచ్చాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్‌కు శనీశ్వరంగా మారిందన్నారు. సమావేశంలో ప్రొఫెసర్ వీరన్న నాయక్, పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, హుస్సేన్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



5కే రన్నర్స్ జట్టుతో పోలీస్ కమిషనర్ శ్వేత

సంపాదన కంటే ఆరోగ్యం ముఖ్యం

- నిత్యం వ్యాయామం అవసరం
- పోలీస్ కమిషనర్ శ్వేత

కొండపాక(గజ్వేల్): ఆరోగ్యానికి శారీరక శ్రమ తప్పనిసరి అని పోలీస్ కమిషనర్ శ్వేత అన్నారు. మండల పరిధిలోని మర్పడ్గ గ్రామ శివారులోని ఆక్సిజన్ పార్కులో రన్నింగ్‌లో శిక్షణ పొందుతున్న వారికి ఆదివారం ఆమె టీ షర్టులను అందజేసి వారితో 5కే రన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్తుల సంపాదన కంటే ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ముఖ్యమని, దానికోసం నిత్యం వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తుల బాపురెడ్డి, త్రీ టౌన్, వన్‌టౌన్ సీఐలు భానుప్రకాశ్, కృష్ణారెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పన్యాల రాజిరెడ్డి, ముత్యాల సురేందర్‌రెడ్డి, పాతూరి సుజాత, మాలతీ, రమాదేవి, గీతాదేవి, సతీశ్, కేవీఎస్ రెడ్డి, సునంద, లక్ష్మణ్, వనజ తదితరులు పాల్గొన్నారు.

రేపు గజ్వేల్‌లో నామినేషన్ వేస్తా

కేసీఆర్ గెలిస్తే అధోగతే..

- ఇక్కడ కూడా హుజురాబాద్ ఉప ఎన్నికల ఫలితమే
- ధర్మయుద్ధంలో అంతా కలిసి రావాలి
- బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్



ములుగు (గజ్వేల్): ఈటల సమక్షంలో బీజేపీలో చేరిన యువకులు, నాయకులు

గజ్వేల్: ప్రస్తుత ఎన్నికల్లో గజ్వేల్‌లోనూ హుజురాబాద్ ఉప ఎన్నికల ఫలితమే పునరావృతం కాబోతున్నదని బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. 7న గజ్వేల్‌లో నామినేషన్ వేస్తున్నానని తెలిపారు. ప్రలోభాలకు గురిచేసినా, మద్యం ఏరులై పారించినా కేసీఆర్‌ను ఓడించేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ తీరుపై మండిపడ్డారు. ఈసారి ఎన్నికల్లో సర్వే సంస్థలకు అందని ఫలితమే ఎన్నికల్లో రాబోతున్నదని పునరుద్ఘాటించారు. కేసీఆర్ గెలిస్తే అధోగతి పాలవుతామని ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు బీజేపీని గెలిపించడానికి సమాయత్తమవుతున్నారని చెప్పారు. అభివృద్ధి పేరుతో ఎక్కడికక్కడా పేదల భూములను లాక్కొని 30వేల కుటుంబాలను రోడ్డున పడేశారని ఆరోపించారు. భూములు లాక్కున్న సందర్భంలో సరైన నష్ట పరిహారం అందకపోవడంతో వారంతా నేడు అడ్డా కూలీలుగా మారిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల వద్ద కారుచౌకగా భూములను లాక్కొని పెట్టుబడుదారులకు ప్రభుత్వం భారీ ధరకు అమ్ముకుంటూ రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మండిపడ్డారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చేసిన పనులకు బిల్లులు రాక అప్పులపాలయ్యారని తెలిపారు. ఈ నియోజకవర్గంలో ప్రతి ఇంట్లోనూ ఒక కేసీఆర్ బాధితుడు ఉన్నారని చెప్పారు. కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున్న తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ విలేకరుల సమావేశంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, బీజేపీ నేతలు జశ్వంత్‌రెడ్డి, సింగం సత్తయ్య, కప్పర ప్రసాదరావు, పేర్ల శ్రీనివాస్, గురువారెడ్డి, నందన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల విశ్వాసం కోల్పోయిన బీఆర్‌ఎస్

ములుగు(గజ్వేల్): రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయిందని బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ములుగు మండలం కొక్కొండ గ్రామ ఆయా పార్టీలకు చెందిన నాయకులు, యువకులు షామీర్‌పేటలో ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ రాష్ట్రంలో దోచుకున్నది చాలక దేశంలో దోచుకోవడానికి బీఆర్‌ఎస్ పార్టీగా మార్చారని విమర్శించారు. కేసీఆర్ నిరుద్యోగుల బతుకులతో ఆడుకుంటున్నారన్నారని మండిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ప్రజలు బీజేపీని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సురేష్‌గౌడ్, మల్లేష్, భాస్కర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

అవినీతి ప్రభుత్వాన్ని గద్దెదించుదాం

బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): అవినీతిలో కూరుకుపోయిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని దుబ్బాక ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. రాయపోలు మండలంలోని వడ్డేపల్లి, వీరారెడ్డిపల్లిలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తొమ్మిదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని, ఇందుకు కాళేశ్వరం ప్రాజెక్టే నిదర్శనమన్నారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ బీటలువారిందని, వారి అవినీతికి ఇదే పరాకాష్ట అన్నారు. సంక్షేమాన్ని మరిచిన కేసీఆర్ పాలనకు చరమగీతం పాడాలన్నారు. బీజేపీ సర్కారుతో అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకట్‌గౌడ్, రాజాగౌడ్, స్వామి, రాజిరెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



వడ్డేపల్లిలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

చెల్లీ.. నీ ఓటు మా ఆయనకే..



బీడీలు చుడుతున్న కొమ్మూరి అరుణ

స్థానికుడైన కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డినే ఈ సారి జనగామ ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలని ఆయన సతీమణి అరుణ అన్నారు. ఆదివారం మండలంలోని బైరాన్‌పల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఆరు గ్యారంటీ కార్డుల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం మాట్లాడుతూ మూడోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే ప్రజలను నట్టేట ముంచుతారన్నారు. ప్రచారంలో భాగంగా అరుణ బీడీలు చుట్టి ఓటర్లను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కామెడీ జీవన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రాములు, దాసరి మనోజ్, మ్యాక మల్లేశం పాల్గొన్నారు.

–మద్దూరు(హుస్నాబాద్)

జెండా పట్టు.. బీఆర్‌ఎస్‌కు జై కొట్టు



జెండాలతో నృత్యం చేస్తున్న చిన్నారులు

మండలంలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాలలో ఆదివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ప్రచారం నిర్వహించారు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో ఈ రెండు గ్రామాల చిన్నారులు కూడా ప్రచారంలో భాగమయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు, జెండాలు చేతబూని పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేశారు. తమ తల్లిదండ్రుల్లాగే తాము కూడా బీఆర్‌ఎస్‌కు మద్దతు తెలుపుతున్నామని చిన్నారులు చెప్పారు.

–నర్సాపూర్ రూరల్

వరి పొలాల్లో.. ప్రచార మోత



బ్రహ్మణపల్లిలో ఓటు వేయాలని రైతులను కోరుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ముమ్మరంగా ప్రచారం నిర్వహించారు. బ్రహ్మణపల్లిలో వ్యవసాయ పొలాల్లో పనిచేస్తున్న రైతుల వద్దకు వెళ్లి బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధి పనుల గురించి వివరించి, కేసీఆర్‌కు ఓటు వేయాలని కోరారు.

–తూప్రాన్

ఓటు కోసం.. కోటి విన్యాసాలు



యువకుడికి గడ్డం గీస్తున్న ఎంపీపీ బాలేశం గౌడ్

ఓటు కోసం నాయకులు కోటి విన్యాసాలు ప్రదర్శిస్తున్నారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ జోరుగా ప్రచారం నిర్వహిస్తుంది. ఆదివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీపీ బాలేషం గౌడ్ స్థానికంగా ఉన్న ఓ కటింగ్ షాపులో యువకుడికి గడ్డం గీస్తూ కారు గుర్తుకే ఓటేయాలని అభ్యర్థించారు. సీఎం కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

–జగదేవ్‌పూర్ (గజ్వేల్)

క్లుప్తంగా

నగదు పట్టివేత

జహీరాబాద్: సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.19.90 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలంలోని మాడ్గి చెక్‌పోస్టు వద్ద 65వ జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తుండగా నగదు పట్టుబడినట్లు చిరాగ్‌పల్లి ఎస్‌ఐ నరేష్ తెలిపారు. సునీల్ అనే వ్యక్తి మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు కారులో డబ్బు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి



కూరగాయలు విక్రయిస్తున్న రజిత

హుస్నాబాద్: హుస్నాబాద్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి సతీష్‌కుమార్ అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఆదివారం ఆమె పట్టణంలోని 19వ వార్డులో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ముగిసిన నెట్‌బాల్ పోటీలు

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని బూర్గుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న రాష్ట్రస్థాయి అండర్–19 నెట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. చివరి రోజు జరిగిన పోటీల్లో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో మహబూబ్‌నగర్, తృతీయ స్థానంలో నిజామాబాద్ జిల్లా జట్లు నిలవగా, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో ఖమ్మం, ద్వితీయ స్థానంలో మెదక్, తృతీయ స్థానంలో కరీంనగర్ జట్లు నిలిచాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు.

నువ్వా.. నేనా!



- ❒ సెంటిమెంట్ ఇలాఖా గజ్వేల్‌లో ప్రచార హోరు
- ❒ అభివృద్ధి, సంక్షేమంతో బీఆర్‌ఎస్ ముందుకు..
- ❒ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే ఎజెండాగా బీజేపీ, కాంగ్రెస్
- ❒ రోడ్‌షోలు, సభలు, సమావేశాలతో ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం


సెంటిమెంట్ 'ఇలాఖా'గా పేరున్న గజ్వేల్‌లో రాజకీయం వేడెక్కింది. ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు నువ్వా.. నేనా.. అన్నట్లుగా ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నాయి. వాడవాడలా తిరుగుతూ ఓటర్లను ఆకట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి.

- గజ్వేల్

రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలతో పోలిస్తే గజ్వేల్ ఎన్నో విశేషాలకు నెలవు. ప్రత్యేకించి 1952లో జరిగిన ఎన్నికల్లో మిగితా 15సార్లు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిచినా రాష్ట్రంలో ఆ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రావడం అనవాయితీగా వస్తుంది. ఇదే 'సెంటిమెంట్'ను నమ్ముకొని సీఎం కేసీఆర్ ఇక్కడి నుంచి ముచ్చటగా మూడోసారి పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రమంతటా తిరిగే అవసరమున్నా దృష్ట్యా ఆయన ప్రచార బాధ్యతలను పార్టీ యంత్రాంగమే చేపడుతోంది. ఇందుకోసం ఎన్నికల ఇన్‌చార్జులుగా మంత్రి హరీశ్‌రావు, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డిలు వ్యవహరిస్తుండగా...సమన్వయ కమిటీ సభ్యులుగా మాజీ కార్పొరేషన్ చైర్మన్ భూంరెడ్డి, ఎలక్షన్ రెడ్డిలు వ్యవహరిస్తున్నారు. వీరి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుంది. కేసీఆర్ ప్రాతినిధ్యం ఫలితంగా పదేళ్లలో నియోజకవర్గంలో వచ్చిన మార్పును ప్రజలకు వివరిస్తున్నారు. ప్రత్యేకించి ఇక్కడ వేలాది కోట్ల వ్యయంతో నిర్మించిన కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్, హార్టికల్చర్ యూనివర్సిటీ, ఫారెస్ట్రీ కళాశాలతో పాటు గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన రింగురోడ్డు, ఎడ్యుకేషన్ హబ్‌వంటి భారీ అభివృద్ధి ప్రాజెక్ట్‌లే కాకుండా నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పన కోసం తీసుకున్న చర్యలను వివరిస్తున్నారు. అదేవిధంగా కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్షేమ పథకాల వల్ల మార్పును సైతం ఓటర్లకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. రోడ్‌షోలు, నృత్యాలతో ఆ పార్టీ నేతలు ఆకట్టుకుంటున్నారు. ప్రత్యేకించి వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రచారానికి వెళ్లిన ప్రతీచోట 'గులాబీ జెండాలే రామక్క' పాటపై మహిళలతో కలిసి నృత్యం చేస్తూ ప్రచారాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు.

బీజేపీ సైతం గట్టిగానే కదన రంగంలోకి దిగింది. ఈ పార్టీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారం వేగం పెంచారు. ప్రత్యేకించి నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలపై దృష్టి పెట్టారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు నష్ట పరిహారం ఇతర ప్యాకేజీల పంపిణీలో నెలకొన్న జాప్యాన్ని ఎత్తిచూపే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా నియోజకర్గంలో అభివృద్ధి పేరిట విధ్వంసం జరిగిందని చెబుతూ...పేదలకు చెందిన వేలాది ఎకరాల భూములను లాక్కొని రోడ్డున పడేశారని ప్రచారం చేస్తున్నారు. ఈ కష్టాల నుంచి బయట పడాలంటే బీజేపీ గెలిపించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ సైతం సత్తా చాటేందుకు ప్రయత్నిస్తుంది. ఈ పార్టీ తూంకుంట నర్సారెడ్డి తాను 2009లో ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో ప్రజలందరికీ 24గంటలు అందుబాటులో ఉన్నానని, కానీ కేసీఆర్ నియోజకవర్గ ప్రజలకు కనీసం దర్శనం ఇచ్చే పరిస్థితి లేదని చెబుతూ ప్రజల్లోకి వెళ్తున్నారు. మరోసారి బీఆర్‌ఎస్ గెలిస్తే కేసీఆర్ నియోజకవర్గాన్ని ఏమాత్రం పట్టించుకోడని, స్థానికుల సమస్యల పరిష్కారానికి కలవడానికి ప్రయత్నించినా అది జరగదని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అంతేకాకుండా కాళేశ్వరం ప్రాజెక్ట్‌ల్లో కేసీఆర్ కుటుంబం భారీగా అవినీతికి పాల్పడిందనే విషయాన్ని కూడా కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంది. మొత్తానికి గజ్వేల్‌లో ప్రచార పర్వం ఆసక్తికరంగా మారింది. నామినేషన్లు ముగిసిన తర్వాత ప్రచారం తీరు మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.



కులం పేరుతో వస్తే ఓట్లు వేయొద్దు



ప్రచారంలో పాల్గొన్న సునీతారెడ్డి, మదన్‌రెడ్డి

నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి

నర్సాపూర్ రూరల్: కులం పేరుతో వస్తే ఓట్లు వేయొద్దని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నాగులపల్లి, మూసాపేట గ్రామాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి న్యాయం చేసే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ బోర్డ్ చైర్మన్ దేవేందర్ రెడ్డి, సర్పంచులు సేనాధిపతి, లావణ్య రవి, జీవన్ రెడ్డి, శ్రీధర్ గుప్తా, శేఖర్, జితేందర్ రెడ్డి, బిక్షపతి, రఘువీర్, బలరాం రెడ్డి, అన్నము రవి, మేఘమాల పాల్గొన్నారు. అదేవిధంగా చిన్నచింతకుంట, పెద్దచింతకుంట గ్రామాల్లో ఆదివారం రాత్రి సునీతాలక్ష్మారెడ్డి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నర్సింగ్ రావు, సర్పంచ్ లు సురేష్ గౌడ్, శివకుమార్, మురళి గౌడ్, రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సోనియమ్మ రుణం తీర్చుకుందాం



కాంగ్రెస్‌లో చేరిన నాయకులతో చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పాటుపడేది కాంగ్రెస్ మాత్రమేనని ఆ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎల్లారెడ్డిపేట మదిర సయ్యద్ నగర్ మైనారిటీ నాయకులు ఆదివారం హస్తం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇచ్చి సోనియమ్మ రుణం తీర్చుకుందామని కోరారు. దుబ్బాకలో మాజీ మంత్రి దివంగత చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందని తెలిపారు. తనను దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిపిస్తే సిద్దిపేట, గజ్వేల్‌కు దీటుగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో స్వామి, నరేందర్‌రెడ్డి, నర్సింలుగౌడ్, రవీందర్, నిరంజన్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కుటుంబ పాలనకు చరమగీతం



బీజేపీలో చేరుతున్న నాయకులు

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్

కొండపాక(గజ్వేల్): కుటుంబ పాలనకు చరమ గీతం పాడుదామని గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని లకుడారం, ఎర్రవల్లి, బొబ్బాయిపల్లి, కొండపాక, తిప్పారం, బందారం, సింగారం, చిన్న కిష్టాపూర్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లకు చెందిన 250 మంది యువత బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అభివృద్ధి పేరిట వేల కోట్ల రూపాయలను సీఎం కేసీఆర్ కుటుంబం దోచుకుందని ఆరోపించారు. తనను గెలిపిస్తే గజ్వేల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు మన్నెం శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణం ఉన్నంత వరకు ప్రజాసేవ

బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్: ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడికి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి చింతా ప్రభాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని నాగపూర్, ఇరిగిపల్లి, కలబ్ గూర్, కులాబ్ గూర్, తాళ్ళపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన ప్రాణం ఉన్నంత వరకు ప్రజల కోసం పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చక్రపాణి, సునీత, కసాల బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.



ప్రభాకర్‌ను గజమాలతో సత్కరిస్తున్న కార్యకర్తలు



మాయమాటలు నమ్మి గోస పడొద్దు

ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీజేపీల మాటలను నమ్మి గోస పడొద్దని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి కోరారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లిలో సర్పంచ్ మల్లమారి రవీందర్, గ్రామాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డిల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కేసీఆర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలంటూ కాంగ్రెస్, డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ బీజేపీలు గ్రామాల్లో కొత్త బిచ్చగాళ్ళ మాదిరిగా తిరుగుతున్నారన్నారు. అధికారం కోసం వస్తున్న ప్రతిపక్షాలను చిత్తుగా ఓడించాలన్నారు. కుల మతాలకతీతంగా పథకాలు అందిస్తున్న కేసీఆర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ఆరెపల్లి మహాదేవ్‌గౌడ్, చిట్టి మాధురిరెడ్డి, అనంతుల పద్మ, ప్రశాంత్, నూనె కుమార్, ర్యాగల్ల దుర్గయ్య, రాధాకిషన్‌రెడ్డి, బొద్దుల కనకయ్య, దోమల ఎల్లం పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిపల్లిలో మాట్లాడుతున్న యాదవరెడ్డి

బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరుతున్న యువకులు

కొండపాక(గజ్వేల్): యువత తలుచుకుంటే సాధించనిది లేదని డీసీసీబీ చైర్మన్, ఎన్నికల మండల ఇన్‌చార్జి చిట్టి దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, బందారం గ్రామాలకు చెందిన 150 మంది యువకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు ఆకర్శితులై యువత బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. ప్రాణాలకు తెగించి సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారన్నారు. కార్యక్రమంలో నూనె కుమార్, మల్లమారి రవీందర్, ర్యాగల్ల దుర్గయ్య, భాస్కర్, మహిపాల్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సున్నం భాస్కర్ పాల్గొన్నారు.

జోరుగా హుషారుగా..

దుబ్బాక: మున్సిపల్ పరిధిలో బీఆర్‌ఎస్ ప్రచారం జోరందుకుంది. ధర్మాజీపేటలో ఆదివారం కౌన్సిలర్లు కనకయ్య, స్వామి, బాలకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచార పాటలకు కౌన్సిలర్లు, నాయకులు స్టెప్పులు వేస్తూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాజమౌళి, భూంరెడ్డి, బాలకృషన్ గౌడ్, వంశీ కృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.



ప్రచార పాటలకు నృత్యం చేస్తున్న కౌన్సిలర్లు

ప్రేమ జంటను కాపాడిన పోలీసులు

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రేమ జంట ఆత్మహత్యకు పాల్పడబోతుండగా పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి రక్షించిన సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ అటవీ ప్రాంతంలో చోటుచేసుకుంది. గోవిందాపూర్‌కు చెందిన స్వామి, మెదక్ జిల్లా రామాయంపేట మండలం బచ్చురాజ్‌పల్లికి చెందిన రేణుక యేడాది కాలంగా ప్రేమించుకున్నారు. ఇటీవలే కులాంతర వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని ఇరు కుటుంబాలు అంగీకరించక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం అటవీ ప్రాంతానికి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు వీడియో కాల్ ద్వారా స్నేహితులకు తెలిపారు. దీంతో ఆందోళనకు గురైన స్నేహితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్పందించిన పోలీసులు ఫోన్‌ను ట్రేస్ చేసి లొకేషన్‌ను తెలుసుకున్నారు. ఎస్‌ఐ చైతన్య కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని ప్రేమ జంటను కాపాడారు. అనంతరం వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఆత్మహత్య చేసుకోబోయిన ప్రేమ జంటను కాపాడిన ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి

అవినీతికి కేరాఫ్ అడ్రస్ బీఆర్‌ఎస్



రఘునందన్‌రావుకు స్వాగతం పలుకుతున్న మహిళలు

దుబ్బాకటౌన్ : అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన దగాకోరు కేసీఆర్ పాలనకు ప్రజలు చరమగీతం పాడబోతున్నారని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని లచ్చపేట, మండలంలోని ఆకారం, రఘోత్తంపల్లి, గోసాన్‌పల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేసీఆర్ పాలన ఏపాటిదో మేడిగడ్డ ప్రాజెక్టును చూస్తే తేటతెల్లం అవుతుందన్నారు. అనవసర ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకోవాలని చూస్తున్న బీఆర్‌ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం మండలంలోని బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు బీజేపీలో చేరారు.

తొగుట(దుబ్బాక): దుబ్బాకలో బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రఘునందన్‌రావు ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని రాంపురం గ్రామస్తులు ఆదివారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనతో విసుగు చెందిన యువత మార్పు కోరుకుంటుందన్నారు. ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపించాలని విజ్ఞప్తి చేశారు.